సాక్షి ఖమ్మం

గురువారం, 6, ఏప్రిల్, 2023



ముగిసిన బ్రహ్మోత్సవాలు

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో గత నెల 22నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. 8లో



'తపాలా' వడ్డీ పెరిగింది..

తపాలా శాఖ అమలుచేస్తున్న పథకాలపై ఈ ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలలకు వడ్డీ పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
40° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం ఎండ ఎక్కువగానే నమోదవుతుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సా॥) 6.28

సహర్ (శుక్రవారం ఉ॥) 4.36

న్యూస్‌రీల్

అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పూర్తి



లాంగ్‌జంప్ చేస్తున్న బాలికలు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర ఫెడరేషన్ కప్ పోటీల కోసం జిల్లా అథ్లెటిక్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో అథ్లెట్లు పాల్గొన్నారు. సీనియర్ అథ్లెటిక్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్, కోశాధికారి ఎం.సుధాకర్, ఉపాధ్యక్షులు కె.పవన్‌కుమార్, ఎస్.వెంకటేశ్వర్లు, డి.రవికుమార్, తిరుపతి పోటీలను పర్యవేక్షించారు. జిల్లా జట్టుకు వి.సంధ్య(మద్దులపల్లి), ఎ.మైథిలి, బి.ఇందుప్రియ(ఖమ్మం), కామాక్షి(కల్లూరు), ఎస్.నాగేశ్వరి, సీహెచ్.దీపిక, పి.నాగమణి(తనికెళ్ల), డి.వివేక్‌చంద్ర(ఖమ్మం), జె.అనిల్(పిండిప్రోలు)ను ఎంపిక చేయగా, వీరు 15, 16వ తేదీల్లో వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఫెడరేషన్ కప్ పోటీల్లో పాల్గొననున్నారు.

వైరా మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు

వైరా: వైరా మున్సిపాలిటీ మున్సిపల్ కమిషనర్‌గా పి.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ కమిషనర్ సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీలో గ్రేడ్–3 మున్సిపల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లును వైరా కమిషనర్‌గా నియమించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన నడింపల్లి వెంకటపతిరాజు గత ఏడాది సెప్టెంబర్ 30న ఉద్యోగ విరమణ చేయగా, మున్సిపల్ ఏఈ అనితకు ఇన్‌చార్జ్‌గా కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. కాగా, వైరా మున్సిపాలిటీ ఏర్పడిన నాలుగున్నరేళ్లలో దాదాపు పది మంది కమిషనర్లు పనిచేయగా, ఏ ఒక్కరు ఏడాది కాలం కొనసాగిన దాఖలాలు లేవు. ఇప్పుడు 11వ కమిషనర్‌గా వెంకటేశ్వర్లును నియమించగా.. కమిషనర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అనిత ఏఈగా కొనసాగనున్నారు.


సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సీతారాం

ఖమ్మం వైద్యవిభాగం: వయోబేధం లేకుండా అకస్మాత్తుగా కుప్పకూలి గుండెపోటుతో మృతి చెందుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈ నేపథ్యాన ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఇందులో జిల్లాలోని వైద్యసిబ్బందికి కూడా శిక్షణ ఇస్తుండగా, బుధవారం ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో నర్సింగ్, వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా కార్డియాలజిస్ట్ సీతారాం సీపీఆర్ చేయాల్సిన విధానాన్ని వివరించారు. తొలుత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని సందర్భంగా ఆయన చిత్రపటానికి డీఎంహెచ్‌ఓ మాలతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌ఎంఓలు బి, వెంకటేశ్వర్లు, అమర్‌సింగ్, వైద్యులు సురేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుగుణ పాల్గొన్నారు.

రోడ్ల నాణ్యతపై కమిషనర్ ఆరా



రోడ్డు కొలతలు వేయిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో నిర్మించిన సీసీ, వీడీఎఫ్ రోడ్లను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి బుధవారం పరిశీలించారు. ఎంబీల్లో నమోదు చేసిన విధంగా రోడ్ల నాణ్యత, కొలతలు ఉన్నాయా అని ఆయన 43, 51, 53వ డివిజన్లలో తనిఖీ చేశారు. అభివృద్ధి పనులను అధికారులు పర్యవేక్షించాలని, నాణ్యతాలోపం కనిపిస్తే బాధ్యులపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రంజిత్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



జల కళకళ

- మార్చిలో కూడా ఆశాజనకంగా భూగర్భ జలాలు
- ఇటీవలి వర్షాలతో పెరుగుదల నమోదు
- గత కొన్నేళ్లుగా వేసవిలోనూ ఎదురుకాని ఇబ్బంది
- కొన్ని మండలాల్లో మాత్రం అడుగంటుతున్న నీరు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో భూగర్భ జలాలు గత ఏడాదితో పోలిస్తే కొంత మేర వృద్ధి చెందాయి. గత ఏడాది మార్చిలో 5.40 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు.. ఈ ఏడాది 5.15 మీటర్ల వద్దే అందుబాటులోకి వచ్చాయి. గత నెలలో ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాల్లో పెరుగుదల కనిపించింది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో గత ఏడాదితో పోలిస్తే మాత్రం భూగర్భ జలాలు కొంత లోతులోకి వెళ్లాయి. అయినప్పటికీ మొత్తంగా పరిశీలిస్తే గత కొన్నేళ్లుగా వేసవిలో భూగర్భ జలాల్లో పెరుగుదల ఆశాజనకంగా ఉంది. కానీ కొన్ని మండలాల్లో మా త్రం భూగర్భ జలాలు చాలా లోతుల్లో ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

గణనీయంగా పెరుగుతూ ..

సాధారణంగా వేసవిలో ఎండల కారణంగా భూగర్భ జలాల్లో తగ్గుదల కనిపిస్తుంది. కానీ జిల్లాలో మాత్రం ఏటేటా భూగర్భ జలాలు పైపైకి వస్తున్నాయి. 2016–17 ఏడాది నుంచి ఈ పెరుగుదల స్థిరంగా ఉంటోంది. ఆ ఏడాదిలో 7.62 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా.. గత ఏడాది(2021–22)లో 4.27 మీటర్ల వరకు వచ్చేశాయి. గతంలో వేసవికాలంలో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో బోర్లు, బావులు ఎండిపోయి ఇబ్బందులు ఎదుర్కొనే వారు. అయితే, భూగర్భ జలాల్లో పెరుగుదల కారణంగా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో అవసరాలకు అనుగుణంగా నీరు లభిస్తోంది.

మార్చిలో 0.25 మీటర్ల పైకి ..

ఈ ఏడాది మార్చిలో జిల్లాలో సగటున 5.15 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయంలో 5.40 మీటర్ల లోతులో ఉండగా.. ఈసారి దాదాపు 0.25 మీటర్ల పైకి నీరు చేరింది. అలాగే గత జనవరిలో 4.56 మీటర్ల లోతులో నీరు ఉంటే.. ఈ ఏడాది జనవరిలో 4.46 మీటర్ల వద్దే నీటి లభ్యత నమోదైంది. ఫిబ్రవరిలో మాత్రం గత ఏడాది 4.77 మీటర్ల వద్ద నీరు ఉంటే.. ఈ సారి 5.11 మీటర్ల లోతుకు వెళ్లింది. ఇక మార్చికి వచ్చే సరికి 0.4 మీటర్ల మేర నీరు పైకి చేరింది. మార్చిలో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురవడంతో ఈ పరిస్థితి కనిపించింది.

అక్కడక్కడా ప్రమాద ఘంటికలు

జిల్లాలో సగటున ఏటా భూగర్భ జలాలు పెరుగుతున్నా.. కొన్ని మండలాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఆయా మండలాల్లో భూగర్భ జలాలు అడుగుకు వెళ్తున్నాయి. ఎక్కువగా పంటలు సాగయ్యే ప్రాంతాల్లోనే ఈ పరిస్థితి ఉంటోంది. సత్తుపల్లి మండలంలో గత ఏడాది జనవరిలో 14.11 మీటర్ల లోతులో నీరు ఉండగా.. ఈ ఏడాది 14.64 మీటర్ల వద్దకు పడిపోయింది. గత ఏడాది ఫిబ్రవరిలో 15.64 మీటర్లు ఉండగా.. ఈ ఏడాది 16.81 మీటర్లకు పడిపోవడం గమనార్హం. గత ఏడాది మార్చిలో 16.53 మీటర్ల లోతులో జలాలు ఉండగా.. ఈ ఏడాది మాత్రం 16.33 మీటర్ల వద్దకు నీరు చేరింది. అలాగే ఎర్రుపాలెం, కామేపల్లి, ఖమ్మంరూరల్, కూసుమంచి, సింగరేణి, రఘునాథపాలెం తదితర మండలాల్లో గత ఏడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ జలాలు మరింత లోతుకు వెళ్లాయి. ముఖ్యంగా సత్తుపల్లి మండలంలో ఆందోళన కలిగించే స్థాయిలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నా... ఈ ఏడాది 0.20 మీటర్ల మేరకు పెరగడం ఊరటనిచ్చే అంశంగా చెప్పొచ్చు.

ఈ మండలాల్లో పుష్కలం

జిల్లాలోని కొన్ని మండలాల్లో గత కొంత కాలంగా భూగర్భ జలాల పెరుగుదల స్థిరంగా ఉంది. ఖమ్మం అర్బన్ మండలంలో 1.24 మీటర్ల లోతులోనే నీరు లభిస్తోంది. ముదిగొండలో 1.71 మీటర్లు, బోనకల్ మండలంలో 1.81 మీటర్లు, కొణిజర్లలో 1.96 మీటర్లు, వైరాలో 2.32 మీటర్లు, నేలకొండపల్లిలో 2.64,తల్లాడలో 2.68 మీటర్లు, చింతకానిలో 2.78, కల్లూరులో 2.79 మీటర్ల వద్దేనీటి లభ్యత ఉండడం విశేషం. వీటితోపాటు మరికొన్ని మండలాల్లోనూ నీటి మట్టం పైపైకి చేరుతోంది. ఒక్క బోనకల్ మండలం మినహా అన్ని మండలాల్లో గత ఏడాదితో పోలిస్తే పెరుగుదల కనిపిస్తోంది.

2016-17 నుంచి భూగర్భ జలాల మట్టం

ఏడాది	నీటిమట్టం (సగటున -మీటర్లలో)
2016 - 17	7.62
2017 - 18	6.48
2018 - 19	5.88
2019 - 20	5.49
2020 - 21	3.95
2021 - 22	4.27

మహనీయుల జీవితాలే పాఠాలు



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ గౌతమ్, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, పక్కన మేయర్ నీరజ, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ సత్యనారాయణ, వివిధ సంఘాల నాయకులు

- దళితుల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం
- జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: మహనీయుల జీవితాలనే పాఠాలుగా భావిస్తే ఎంతో నేర్చుకోవచ్చని.. వారి జీవితాలు ఒక సందేశంలా ఉంటాయని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను పురస్కరించుకుని బుధవారం ఖమ్మంలోని ఆయన విగ్రహానికి జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మేయర్ పి.నీరజ, సుడా చైర్మన్ విజయ్ తదితరులతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భక్త రామదాసు కళాక్షేత్రంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో కలెక్టర్ మాట్లాడారు. ఉప ప్రధానిగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా వ్యవస్థలో ఉంటూనే దళితుల అభ్యున్నతికి పోరాడిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని తెలిపారు.

దళితుల అభివృద్ధికి చర్యలు

రాష్ట్రంలోని దళితుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, దళితబంధు ద్వారా రూ.10 లక్షల పెట్టుబడి సాయం అందిస్తోందని కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. పైలట్ ప్రాజెక్టుగా చింతకాని మండలంలో 3,600 దళిత కుటుంబాలకు లబ్ధి చేకూరగా, హార్వెస్టర్లు తీసుకున్న లబ్ధిదారులు జిల్లా రైతులకు ఉపయోగపడడమే కాక ఇతర రాష్ట్రాల్లో పనికి వెళ్తున్నారని తెలిపారు. ఇదివరకు జిల్లాలో నాలుగు డ్రోన్లు ఉండగా, ఇప్పుడు 26కు చేరడంతో లబ్ధిదారులు రోజుకు రూ.5 నుండి రూ.10 వేల వరకు సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. ఈమేరకు దళితబంధు యూనిట్లతో విజయం సాధించిన వారి వివరాలు వెల్లడించేందుకు ఎస్సీ గురుకులాల విద్యార్థులను తీసుకెళ్లాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మహనీయుల సేవలను స్మరించుకోవడానికి ఇది చక్కటి అవకాశమని తెలిపారు. అనంతరం సుడా చైర్మన్ విజయ్ మాట్లాడగా, ఎస్సీ బాలుర 'బీ', ఎస్సీ బాలికల 'ఏ' వసతిగృహాలతో పాటు కళాశాల 'బీ' వసతి గృహాల విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, అదనపు డీసీపీ ఏఎస్‌పీ.బోస్, సోషల్ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ, కార్పొరేటర్ దాదె అమృత, ఉత్సవ కమిటీ కన్వీనర్ గాజుల నర్సింహారావు, కోకన్వీనర్లు జాగటి మధు, గుడిగొండ ఉప్పలమ్మ, జమల్లమూడి దాస్, నారపోగు వెంకటేశ్వర్లుతో పాటు వివిధ శాఖల అధికారులు, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ 'ఏ' బాలికల వసతిగృహం విద్యార్థినుల నృత్య ప్రదర్శన

జిల్లాలో టెన్షన్.. టెన్షన్..



బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న ఖమ్మం రూరల్ పోలీసులు

- బండి సంజయ్‌ని ఖమ్మం జైలుకు తీసుకొస్తారనే ప్రచారంతో బందోబస్తు
- పలువురు బీజేపీ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఇంకొందరు నాయకుల గృహ నిర్బంధం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ని పోలీసులు మంగళవారం అర్ధరాత్రి కరీంనగర్‌లో అరెస్టు చేసిన నేపథ్యాన జిల్లాలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సంజయ్‌కు రిమాండ్ విధిస్తే ఖమ్మం జిల్లా జైలుకు తీసుకొస్తారనే ప్రచారంతో జిల్లావ్యాప్తంగా బీజేపీ నాయకులను బుధవారం తెల్లవారుజాము నుంచే గృహ నిర్బంధం చేయడంతోపాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణను గృహ నిర్బంధం చేయగా.. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డిని అరెస్టు చేశారు. మరోపక్క బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బీజేపీ నాయకులు నగరంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేయగా.. బీఆర్ఎస్ నాయకులు కూడా ప్రతిగా ఖమ్మంలో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.

ప్రజాస్వామ్యవాదులు ఖండించాలి..

బండి సంజయ్ అరెస్టును ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. జిల్లావ్యాప్తంగా తమ పార్టీ కార్యకర్తలు, నాయకులను తెల్లవారుజామునుంచే అదుపులోకి తీసుకోవడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. కనీసం తమను ఎందుకు గృహ నిర్బంధం చేశారో కూడా పోలీసులు చెప్పలేదని పేర్కొన్నారు.

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టుకు నిరసనగా ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను ఆ పార్టీ నాయకులు దహనం చేయగా.. ఖమ్మం టూటౌన్ సీఐ శ్రీధర్ వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇక ఖమ్మంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్ర ప్రదీప్, రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్‌రెడ్డి, బీజేపీ యువమోర్చా నాయకుడు దాసరి శివ, నాయకుడు ఊరుకొండ ఖాదర్ తదితరులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డిని ఖమ్మం రూరల్ మండల వరంగల్ క్రాస్ రోడ్డు సమీపాన అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే బండి సంజయ్‌ను అరెస్ట్ చేయడంతో పాటు జిల్లావ్యాప్తంగా తమ పార్టీ శ్రేణులను అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అనంత ఉపేందర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి నరేంద్రరావు, నాయకులు మేక సంతోష్‌రెడ్డి, బట్టు నాగరాజు, బజ్జూరు మల్లారెడ్డి, కోటమర్తి సుదర్శన్, వీరెల్లి లక్ష్మయ్య, బావియానాయక్, వేణుగోపాల్‌రెడ్డి, ఎల్లారావు గౌడ్, లక్ష్మారెడ్డి, కొమ్మినేని సుధాకర్, విశ్వనాథం, రమేష్, ఉపేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఇక నేలకొండపల్లి మండలం మోటాపురంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్‌ను గృహ నిర్బంధం చేశారు. అలాగే, వైరా, సత్తుపల్లి, పెనుబల్లి తదితర మండలాల్లో బీజేపీ కార్యకర్తలను, నాయకులు పలువురిని గృహ నిర్బంధం చేయడమే కాక కొందరిని అరెస్టు చేశారు.

జిల్లా జైలు వద్ద భారీ బందోబస్తు

ఖమ్మంరూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను బుధవారం హనుమకొండలో జడ్జి ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించారు. అయితే, సంజయ్‌కు రిమాండ్‌కు విధిస్తే ఖమ్మం తీసుకొస్తారనే సమాచారంతో జిల్లాలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఆందోళనలు జరగకుండా పలువురిని ముందస్తుగా అరెస్టు చేయడమే కాక భారీ సంఖ్యలో పోలీసులు జైలు మోహరించారు. అయితే, సంజయ్‌ను ఖమ్మం జైలుకు కాకుండా కరీంనగర్ జైలుకు తరలించారనే సమాచారం అందడంతో జిల్లా పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి 9 గంటల వరకు జిల్లా జైలు వద్ద మొహరించిన బలగాలు వెనుదిరిగాయి.



జిల్లా జైలు వద్ద మోహరించిన పోలీసులు

చివరి దశకు చేరిన పంట నష్టం సర్వే

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో పంట నష్టం సర్వే చివరి దశకు చేరింది. మూడు రోజులుగా సాగుతున్న ఈ ప్రక్రియ గురువారం ముగిసే అవకాశముందని అధికారుల ద్వారా తెలిసింది. గతనెల 17నుంచి 20వ తేదీ వరకు కురిసిన అకాల వర్షాలతో జిల్లాలోని బోనకల్, చింతకాని, కొణిజర్ల, వైరా తదితర మండలాల్లో పంటలకు నష్టం జరిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో పర్యటించి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. దీంతో అధికారులు సర్వే చేపట్టారు. ఎప్పటికప్పుడు సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండగా, ఈప్రక్రియ గురువారం నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

మరింత అప్రమత్తత

- పదో తరగతి పరీక్షలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి
- వివిధ శాఖల ఉద్యోగులకు బాధ్యతలు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా రాష్ట్రంలోని పలుచోట్ల జరుగుతున్న ఘటనలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు బయటపడడంతో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లాలో లోటుపాట్లు లేకుండా పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన అధికారులకు పలు సూచనలు చేయడంతో పాటు మరిన్ని చర్యలకు సిద్ధమయ్యారు.

ఏ ఒక్కరూ ఫోన్ తీసుకురాకుండా..

ఎస్సెస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా జిల్లా స్థాయి అధికారులతో పాటు రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల ఉద్యోగులకు సైతం బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. అలాగే, పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు తీసుకురావొద్దని ఆదేశాలు జారీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు సహా ఏ ఒక్కరు కూడా ఫోన్లు తీసుకెళ్లకుండా పర్యవేక్షించనున్నారు. ఈ అంశంపై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేసిన సూచనలు జిల్లాలో పక్కాగా అమలుచేసేలా కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ సంబంధిత అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇప్పటికే 144 సెక్షన్ అమలు చేస్తుండగా మరింత కట్టుదిట్టడం చేయనున్నారు. అలాగే, ప్రశ్నాపత్రాలను తీసుకురావడం, జవాబుపత్రాలను తరలించడం పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయించారు.

రియల్ మాయాజాలం

- డీటీసీపీ అప్రూవల్ లేకుండా వెంచర్లు, ప్లాట్ల అమ్మకం
- నాలా కన్వర్షన్‌తోనే రిజిస్ట్రేషన్ పూర్తి
- ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి గండి

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణం నానాటికీ అభివృద్ధి చెందుతుండడంతో భూముల విలువ పెరిగింది. దీంతో రియల్ ఎస్టేట్ పేరుతో కొందరు దందాకు తెరలేపారు. పంట భూములను కాస్తా వెంచర్లు మార్చేస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా మట్టి నింపేసి దర్జాగా ప్లాట్లుగా మార్చి విక్రయాలు మొదలుపెడుతున్నారు. కొన్నిచోట్ల అసైన్డ్ భూములను కూడా కలుపుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసిన చోట అనుమతులు లేవని పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు ఫ్లెక్సీలు పెట్టినా నిర్వాహకులు తొలగిస్తుండడం గమనార్హం.

అప్రూవల్ తప్పనిసరైనా..

రియల్ ఎస్టేట్ వెంచర్ల ఏర్పాటు, ప్లాట్ల క్రయవిక్రయాలు జరపాలంటే డీటీసీపీ అప్రూవల్ తప్పనిసరి. అయితే సత్తుపల్లి పట్టణ శివారు నుంచి మండల కేంద్రాల వరకు ఎలాంటి అప్రూవల్ లేకుండానే రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రెయినేజీలు నిర్మించి కాగితాల పైనే అప్రూవల్ చూపిస్తూ అమ్మకాలు చేపడుతున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలో ఈ తరహా అక్రమ లేఔట్లతో రియల్ ఎస్టేట్ దందా సాగుతోంది. సత్తుపల్లి రెవెన్యూ పరిధి కాకర్లపల్లి రోడ్డులో మూడు, అయ్యగారిపేట రెవెన్యూలో రెండు రియల్‌ఎస్టేట్ వెంచర్లకు అనుమతి లేదని మున్సిపాలిటీ అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు.

నాలా కన్వర్షన్‌తోనే సరి

రియల్ ఎస్టేట్ వెంచర్ వేయాలంటే వ్యవసాయ భూమిని వాణిజ్య భూమిగా కన్వర్షన్ చేయాల్సి ఉంటుంది. కొన్నిచోట్ల నాలా కన్వర్షన్ చేసేటప్పుడు ఐదు కుంటల నుంచి పది కుంటల వరకు విడివిడిగా భూమిని బదలాయించి క్రయవిక్రయాలు జరుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే సర్వే నంబర్‌లో పదేపదే ఒకరిద్దరి పేరిట నాలా కన్వర్షన్ చేయొద్దని ఉత్తర్వులు ఉన్నా.. కొందరు బేఖాతర్ చేస్తూ నాలా కన్వర్షన్లు చేస్తున్నట్టు విమర్శలున్నాయి. డీటీసీపీ అనుమతి రావాలంటే నిబంధనల ప్రకారం రోడ్లు, గ్రీనరీ, మున్సిపల్ కానీ పంచాయతీకి గానీ 10శాతం భూమిని బదలాయించాల్సి ఉంటుంది. అదే నాలా కన్వర్షన్ చేసి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తే ఎలాంటి ఇబ్బందులు రావనే భావనతో అడ్డదారి ఎంచుకున్నట్లు తెలుస్తోంది. కాగా నాలా కన్వర్షన్‌తో అక్రమాలు జరుగుతున్నాయని ఇటీవల గుర్తించిన కలెక్టర్.. అత్యవసరమైతే పది కుంటల వరకు మాత్రమే నాలా కన్వర్షన్ చేయాలని అది కూడా భూమిని సంబంధిత అధికారులు పరిశీలించి, సర్వే నంబర్లు తనిఖీ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. పదేపదే నాలా కన్వర్షన్లు జరుగుతుంటే మరింత లోతుగా పరిశీలించాలని సూచించినట్లు సమాచారం.

ఫిర్యాదు అందితే హడావుడి

ఒకసారి నాలా కన్వర్షన్ అయిపోతే ఆ భూమి కాస్తా రిజిస్ట్రేషన్ శాఖకు బదలాయింపు జరుగుతుందని.. ఆతర్వాత రిజిస్ట్రేషన్ చేయొద్దని ఫిర్యాదు అందినా రిజిస్ట్రేషన్ శాఖకు అధికారం ఉండదని తెలుస్తోంది. అయినప్పటికీ రియల్ ఎస్టేట్ వెంచర్లకు సంబంధించి ఫిర్యాదులు రాగానే మున్సిపల్, పంచాయతీ అధికారులు హడావుడి చేయడం.. ఆపై భూముల క్రయవిక్రయాలు నిలిపివేయాలని రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ రాయటం షరామామూలైపోయింది. దీంతో మున్సిపాలిటీ, పంచాయతీల ఆదాయం పడిపోతోంది. ఈ అంశంపై సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కె.సుజాతను వివరణ కోరగా సత్తుపల్లి పట్టణంలో డీటీసీపీ అప్రూవల్ లేకుండా క్రయవిక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, రియల్ ఎస్టేట్ వెంచర్ల యజమానులకు నోటీసులు కూడా జారీ చేస్తున్నామని తెలిపారు.



కాకర్లపల్లి రోడ్డులోని రియల్ ఎస్టేట్ వెంచర్‌కు సిద్ధం చేస్తున్న భూమి



అయ్యగారిపేటలోని వెంచర్‌లో నిర్మిస్తున్న సైడ్ డ్రెయిన్లు

క్లుప్తంగా

ఓయూ నుంచి డాక్టరేట్


భీమనపల్లి కృష్ణ

మధిర: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, మధిరకు చెందిన భీమనపల్లి కృష్ణకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ లక్ష్మి పర్యవేక్షణలో 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం – తెలంగాణలో కూలీల ఆర్థిక విశ్లేషణ' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను ఆయనకు బుధవారం డాక్టరేట్ ప్రకటించారు. కూలీ కుటుంబంలో జన్మించిన కృష్ణ ఓయూలో పీజీ పూర్తిచేశాక, కొన్నాళ్లు లెక్చరర్‌గా పనిచేయడమే కాక ఉపాధి హామీ పథకంలో కూడా విధులు నిర్వర్తించారు.

నేడు ఖమ్మంలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఖమ్మం చేరుకోనున్న ఆయన వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారు. అలాగే, సాయంత్రం 4 గంటలకు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు అందజేయనున్నారు.

నేడు జాబ్ మేళా

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన గురువారం ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా ఏర్పాటుచేసినట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. సత్తుపల్లిలోని సాయిస్ఫూర్తి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఐదు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయనుండగా, ఎంటెక్(సీఎస్ఈ), బీటెక్(సీఎస్‌సీ), ఎంసీఏ అర్హతలు ఉన్న వారు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఇంటర్వ్యూలకు అన్ని సర్టిఫికెట్లకు హాజరు కావాలని సూచించారు.

ఆశ్రమ పాఠశాలల్లో డీడీ తనిఖీ

దమ్మపేట: మండలంలోని పలు గిరిజన ఆశ్రమ పాఠశాలలను భద్రాచలం ఐటీడీఏ డీడీ రమాదేవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుర్గం గొల్లగూడెం, పార్కలగండి, అంకంపాలెం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసిన ఆమె పదో తరగతి విద్యార్థులతో సమావేశమై పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా సూచనలిచ్చారు. అలాగే, విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ధర్మ, వార్డెన్ నాగమణి, ఉపాధ్యాయులు జ్యోతి, రజిని, తిరుపతమ్మ పాల్గొన్నారు.

రామాపురం స్కూల్లో చోరీ

బోనకల్: మండలంలోని రామాపురం ప్రాథమిక పాఠశాలలో చోరీ జరిగింది. కొత్తగా నిర్మించిన భవనం కావడంతో గ్రామ పంచాయతీకి సంబంధించిన సామగ్రిని కూడా ఇక్కడే పెట్టారు. దీంతో మంగళవారం అర్ధరాత్రి తలుపులు పగులగొట్టిన దుండగులు గ్రామపంచాయతీ సామగ్రితో పాటు ఇనుప పైపులు, పాఠశాల ఫర్నిచర్‌ను ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై సర్పంచ్ తొండపు వేణు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య

కారేపల్లి: నెలనెలా వచ్చిన పెన్షన్ మొత్తం మద్యానికి వెచ్చిస్తుండటంతో మందలించినందుకు ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పేరుపల్లికి చెందిన బూడిద దానయ్య (65) పెన్షన్ డబ్బుతో మద్యం తాగి మంగళవారం రాత్రి ఇంటికి వచ్చాడు. దీంతో ఆయన భార్య వీరలక్ష్మి పెన్షన్ డబ్బు మద్యానికి ఖర్చు పెడితే ఎలా అని మందలించింది. దీంతో రాత్రి భోజనం చేశాక ఇంటి ఆవరణలోని రేకులషెడ్డులో నిద్రించేందుకు వెళ్లిన ఆయన లుంగీతో ఉరి వేసుకున్నాడు. బుధవారం ఉదయం గుర్తించిన వీరలక్ష్మి.. కుమారుడు రవికి చెప్పగా పరిశీలించేసరికి దానయ్య మృతి చెంది ఉన్నాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పుష్పాల రామారావు బుధవారం తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మృతి


మట్టూరి వీరయ్య(ఫైల్)

వైరారూరల్: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మట్టూరి వీరయ్య (88) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. కల్లూరులోని కాకతీయ చక్కెర కర్మాగారం పరిధిలో రైతుల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గానే కాక సిరిపురం సర్పంచ్‌గా ఆయన రెండుసార్లు పనిచేశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వీరయ్యను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

భద్రగిరిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

- వేడుకగా చక్రస్నానం, ప్రత్యేక స్నపనం
- నేటి నుంచి నిత్యకల్యాణాలు పునఃప్రారంభం


స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో గత నెల 22న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు బుధవారం బ్రహ్మాండంగా ముగిశాయి. చివరి రోజున స్వామివారి సుదర్శన చక్రానికి చక్రస్నానం వేడుకను కనులపండువగా జరిపారు. సుదర్శన చక్రాన్ని ప్రత్యేక పల్లకీలో మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ పవిత్ర గోదావరి నదీ తీరాన ఉన్న పునర్వసు మండపానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు స్వామివారి ఉత్సవమూర్తులకు మండపంలో స్నపన తిరుమంజనం చేసి హారతి సమర్పించారు. సాయంత్రం ధ్వజావరోహణం, దేవతోద్వాసన, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు నిర్వహించారు. యాగశాలలో పుష్పయాగం, పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఈ పూజల్లో ఏఈఓ శ్రవణ్‌కుమార్, ఆలయ స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయ రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దర్బార్ సేవలు..

నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి నిత్యకల్యాణాలను నిలిపివేశారు. బుధవారం ఉత్సవాలు ముగియడంతో గురువారం నుంచి బేడా మండపంలో తిరిగి నిత్యకల్యాణం, దర్బార్ సేవలను యథావిధిగా జరపనున్నారు. ఈనెల 12న స్వామివారి నూతన పర్యంకోత్సవం నిర్వహించనున్నారు.

నేడు ఆలయ హుండీ లెక్కింపు..

రామాలయ హుండీని గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రకూట మండపంలో ఉదయం 8 గంటలకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.


స్వామివారి ఉత్సవమూర్తులను పునర్వసు మండపానికి తీసుకెళుతున్న అర్చకులు, భక్తులు

ఫ్యాన్ తెచ్చుకోవాల్సిందే !





వేసవి కాలం వచ్చేసింది. నానాటికీ ఉక్కపోత పెరుగుతోంది. ఇళ్లలో అయితే ఎలాగోలా ఇక్కట్లు అధిగమిస్తాం. కానీ ఖమ్మం జిల్లా ప్రధాన ఆస్పత్రిలోని మాతాశిశు కేంద్రం(ఎంసీహెచ్)లోని బాలింతల ఇబ్బందులు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. ఎంసీహెచ్ రెండో అంతస్తులో ఉండగా.. వేడి ఎక్కువగా, ఫ్యాన్లు తక్కువగా ఉండడంతో బాలింతలు ఉక్కపోతతో అవస్థ పడుతున్నారు. దీంతో గర్భిణులను ప్రసవానికి తీసుకొచ్చేటప్పుడు వారి కుటుంబ సభ్యులు టేబుల్ ఫ్యాన్ కూడా వెంట తీసుకొస్తున్నారు. ఫలితంగా ప్రతీ బాలింత బెడ్ వద్ద టేబుల్ ఫ్యాన్లు కనిపిస్తున్నాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

విద్యార్థుల జీవితాలతో బీజేపీ చెలగాటం

జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

బోనకల్: బీజేపీ నేతలు తప్పుడు రాజకీయాలతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. బోనకల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సెస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్ తన పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ రాజకీయాలు చేయడం బీజేపీ నేతల తీరుకు నిదర్శమని తెలిపారు. అధికారం కోసం అడ్డదారి తొక్కిన బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చేబ్రోలు మల్లికార్జున్ రావు, మోదుగు నాగేశ్వరరావు, సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్, నాయకులు మందం శ్రీను, బానోత్ కొండ, వేమూరి ప్రసాద్, మోర్ల నర్సింహారావు, వెంకటేశ్వర్లు, కాకాని శ్రీను, యార్లగడ్డ చిననరసింహ తదితరులు పాల్గొన్నారు.

కాషాయ మూకపనే: ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసే కుట్రలో భాగంగానే పదో తరగతి ప్రశ్నపత్రాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ లీక్ చేయించారని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆరోపించారు. ఇది ముమ్మాటికీ కాషాయ మూక పనేనని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను మనస్తాపానికి గురి చేసిన సంజయ్‌ను కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.


బోనకల్‌లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మంమయూరిసెంటర్: పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రధాన సూత్రధారి బండి సంజయ్ అని.. రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకే బీజేపీ కుట్ర పన్నిందని బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశాక వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లేందుకు కుట్ర పన్నిన సంజయ్.. రాజకీయ అవసరాల కోసం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మంలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

'బలగం' కొమరయ్యకు సత్కారం


సుధాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న రామకృష్ణ విద్యాలయం నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: ఇటీవల విడుదలై విజయం సాధించిన 'బలగం' చిత్రంలో కొమరయ్య పాత్ర పోషించిన కేతిరెడ్డి సుధాకర్‌రెడ్డి బుధవారం ఖమ్మం వచ్చారు. శ్రీ సరస్వతి శిశు మందిరాల్లో ఆచార్యునిగా, ప్రధానాచార్యులుగా పనిచేస్తూ, రంగస్థల నటునిగా గుర్తింపు పొందిన ఆయనను ఖమ్మం గుట్టలబజార్‌లోని శ్రీ రామకృష్ణ విద్యాలయంలో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో నేర ప్రవృత్తి తగ్గి, పిల్లల్లో సంస్కారం పెంపొందేలా శిశు మందిరాలు, రామకృష్ణ విద్యాలయాలు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆ తర్వాత పాఠశాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, ప్రధానాచార్యులు సంతోషా గౌతమ్ మాట్లాడగా కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలి

చింతకాని: పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని నాగులవంచ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో పాలన సక్రమంగా లేకపోగా.. అధికారుల నిర్లక్ష్యంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో బాధ్యులను గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ఇటీవల కురిసిన వర్షాలతో మొక్కజొన్న, ఇతర పంటలు నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఆలస్యం నాగమణి, నాయకులు ఆలస్యం బస్వయ్య, యల్లంపల్లి చిన అప్పారావు, ఆలస్యం రమేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్

రాజకీయ క్రీడగా మారిన పేపర్ లీకేజీలు

- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: నేటి పదో తరగతి ప్రశ్న పత్రాలు, మొన్నటి టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్న పత్రాలు లీకేజీ బీజేపీ, బీఆర్ఎస్ నడుమ రాజకీయ క్రీడగా మారి.. లక్షలాది మంది విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమైపోయిందని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో విమర్శించారు. లీకేజీలకు ప్రధాన సూత్రధారులు, పాత్రధారులెవరో నిగ్గు తేల్చడానికి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తీవ్రమైన సమస్యను పక్కదారి పట్టించి.. రాజకీయ క్రీడగా, బీఆర్ఎస్, బీజేపీల మధ్య పోరాటంగా మార్చడం శోచనీయమని పేర్కొన్నారు. బండి సంజయ్ రాజకీయ క్రీడ, రాజకీయ అవకాశవాదం, ఈ లీకేజీల వ్యవహారాన్ని రక్తికట్టించిందని మండిపడ్డారు. ఆయా ఘటనల్లో అసలు సూత్రధారులెవరో అర్థం కాకుండా చేయడానికి ప్రభుత్వం, బీజేపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డయల్ 100కు 3,665 ఫోన్లు

ఖమ్మంక్రైం: ప్రజల ధన, మాన ప్రాణాల రక్షణే ధ్యేయంగా ఏర్పాటైన డయల్ 100కు గడిచిన మార్చి నెలలో 3,665 మంది ఫోన్ చేశారని సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. ఇందులో 63 ఫోన్లకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పేర్కొన్నారు. కొందరు డయల్ 100పై అవగాహన లేక చిన్న చిన్న అంశాలకు కూడా ఫోన్ చేస్తున్నారని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు.

ఆర్‌ఓబీ వద్ద ఐరన్ షీట్ల చోరీకి యత్నం

మధిర: మధిరలోని బొడ్రాయి వద్ద ఆర్‌ఓబీ కింద నిల్వ చేసిన ఐరన్ షీట్లను చోరీ చేసేందుకు కొందరు యత్నించగా, పోలీసులు అప్రమత్తతతో వారి ప్రయత్నం ఫలించలేదు. ఆర్‌ఓబీ కింద సీట్లు నిల్వ చేశారని తెలుసుకున్న దుండగులు... మంగళవారం అర్ధరాత్రి మెట్ల మీదుగా ఆర్‌ఓబీపైకి ఒక్కో షీట్ చేర్చసాగారు. ఈక్రమంలో కానిస్టేబల్ ప్రసాద్, హోంగార్డు విజయ్ గుర్తించి ఆర్‌ఓబీ వద్దకు వచ్చేలోగా దుండగులు పరారయ్యారు. దీంతో ఏఎస్సై లచ్చు రైల్వే అధికారులకు సమాచారాన్ని ఇవ్వగా, ఐరన్ షీట్లు స్వాధీనం చేసుకున్నారు.

బాధిత కుటుంబాలకు విద్యుత్ శాఖ పరిహారం

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో విద్యుదాఘాతంతో గత ఏడాది మృతి చెందిన కోటేరు సునీత కుటుంబానికి విద్యుత్ శాఖ నుంచి పరిహారం మంజూరైంది. రూ.5 లక్షల చెక్కును బుధవారం ఏడీ సంజయ్‌కుమార్, ఏఈ సతీశ్, వైస్ ఎంపీపీ గుత్తా రవి ఆమె కుటుంబీకులకు అందజేశారు. అలాగే, ఇదే గ్రామంలో ఎస్‌కే అబ్దుల్‌కు చెందిన ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందగా మంజూరైన రూ.40 వేల పరిహారం చెక్కు కూడా అందజేశారు. గ్రామ ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లుతో పాటు గొర్రె శ్రీనివాసరావు, గుండ్ల ముత్తయ్య, కాలంగి వీరబాబు, మద్దుల నాగేశ్వరరావు, షేక్ జానీ, అరెంపుల వెంకన్న, గంగిరెడ్డి విజయ్‌రెడ్డి, గాదె వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

చింతకాని: మండలంలోని నాగులవంచ అండర్ బ్రిడ్జి వద్ద బుధవారం రైల్వే లైన్ విద్యుత్ పనులు చేస్తున్న ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మనోజ్‌రాయ్‌కు విద్యుదాఘాతంతో గాయాలయ్యాయి. విద్యుత్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు వైరు చేతికి తగలడంతో శరీరం కొంత మేర కాలిపోగా కింద పడిన ఆయన తలకు సైతం గాయాలయ్యాయి. దీంతో 108 సిబ్బంది కోట భానుసహాన్, చక్రవర్తి ఆయనకు ప్రథమ చికిత్స చేసి ఖమ్మం తరలించారు.


సునీత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఏడీ, తదితరులు

మావోయిస్టు మిలీషియా సభ్యుల అరెస్టు

భద్రాచలంఅర్బన్: ఇద్దరు మావోయిస్టు మిలీషియా సభ్యులను చర్ల పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. ఈ మేరకు బుధవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ కథనం ప్రకారం... ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామేడు మండలం జారపల్లి గ్రామానికి చెందిన సోడి దూల మిలీషియా సభ్యుడిగా, సోడి సన్నా మిలీషియా డిప్యూటీ కమాండర్‌గా పనిచేస్తున్నారు. మావోయిస్టు పార్టీ నాయకుల ఆదేశాలతో పోలీసులను చంపాలనే ఉద్దేశంతో ఇతర మిలీషియా సభ్యులతో కలిసి చర్ల మండలం గోరుగొండ అటవీ ప్రాంతంలో ప్రెజర్ బాంబు ఏర్పాటు చేసేందుకు పేలుడు పదార్థాలతో వచ్చారు. అదే సమయంలో కూంబింగ్ చేస్తున్న పోలీసులు వారిని గమనించి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా మూడేళ్లుగా మావోయిస్టు మిలీషియాలో పనిచేస్తున్నట్లు అంగీకరించారు. గతేడాది జూన్‌లో చర్ల మండలం గోరుగొండ అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ట్రెంచ్ పనుల్లో చేపడుతున్న పొక్లెయినర్‌ను తగులబెట్టి, జేసీబీ, బైక్‌ను అపహరించిన ఘటనలో వీరు పాల్గొన్నట్లు విచారణలో తేలింది. నిందితులను అరెస్ట్ చేసి, ఒక ఎలక్ట్రిక్ డిటోనేటర్, 2జిలెటిన్ స్టిక్స్, కార్డెక్స్ వైర్, సిరంజీలు, స్టీల్ టిఫిన్ బాక్స్, బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్

వైభవంగా చండీ హోమం

ఖమ్మంరూరల్ : మండలంలోని రెడ్డిపల్లి శ్రీ మారెమ్మతల్లి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం చండీహోమం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యావాచనం, సామూహిక కుంకుమార్చన తదితర కార్యక్రమాలు జరిపించారు. కాగా, గురువారం అమ్మవారికి విశేషంగా అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ ప్రధానార్చకులు కాశావజ్ఝల రామశర్మ తెలిపారు. కార్యక్రమంలో వేద పండితులు మహదేవశర్మ, అర్చకులు సతీష్ శర్మ, నరేందర్ శర్మ, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా చిన్నారి భువనచంద్రిక చేసిన కూచిపూడి నృత్యం అందరినీ ఆకట్టుకుంది.


నృత్యం చేస్తున్న చిన్నారి

నెల పాటు 'తలసేమియా డే' కార్యక్రమాలు

ఖమ్మంవైద్యవిభాగం: ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంకల్ప వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన నెల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ రాజేశ్‌గార్గే తెలిపారు. వచ్చే నెల 7న తలసేమియా డే జరగనుండగా, ఈ నెల 7వ తేదీ నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అందులో భాగంగా శుక్రవారం ఖమ్మం రితన్య ఆస్పత్రిలోని డే కేర్ సెంటర్‌లో రక్తదాన శిబిరం, ఆ తర్వాత చిన్నారులకు మందుల పంపిణీ, ఆటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. తలసేమియాను నిర్మూలించడం, వ్యాధి బారిన పడిన పిల్లలకు అండగా నిలవడమే లక్ష్యంగా తమ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోందని రాజేశ్ తెలిపారు.


డాక్టర్ రాజేశ్‌గార్గే

క్లుప్తంగా...

పిడుగుపాటుకు ఎనిమిది పశువులు మృతి



గుండాల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పిడుగులు పడడంతో ఆళ్లపల్లి మండలం సుద్దరేవు గ్రామంలో మూడు ఆవులు, కిచ్చెనపల్లిలో నాలుగు ఆవులు, ఒక దుక్కిటెద్దు మృత్యువాతపడ్డాయి. మధ్యాహ్నం మేతకు వెళ్లిన పశువులు.. వర్షం కురుస్తుండటంతో చెట్ల కిందకు వెళ్లాయి. ఆ సమయంలో పిడుగులు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. పశువుల మృతితో రైతులు లబోదిబోమంటున్నారు. భారీ వర్షంతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదలతో ఆళ్లపల్లి మండలం జల్లేరు, గుండాల మండలం కిన్నెరసాని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, గుండాల తదితర మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలు ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోగా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ఆంధ్ర ధాన్యం రాకుండా చెక్‌పోస్టు



మిర్యాలగూడ: ఆంధ్ర నుంచి ధాన్యం రాకుండా అడ్డుకునేందుకు జిల్లా యంత్రాంగం చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దుగా ఉన్న నల్లగొండ జిల్లా వాడపల్లి వంతెన వద్ద కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశానుసారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఎస్‌వో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టును బుధవారం తహసీల్దార్ గణేష్, ఎస్‌ఐ రవికుమార్, డీటీ ఖాదర్ లు ప్రారంభించారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించేందుకు రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్, మార్కెటింగ్ శాఖల అధికారులతో మూడు బృందాలను నియమించారు. షిఫ్టులవారీగా ఈ బృందాలు విధులు నిర్వహించనున్నాయి. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతులకు మేలు చేకూర్చడానికి ఆంధ్ర నుంచి ధాన్యం వాహనాల రాకను అడ్డుకునేందుకు ప్రతి సీజన్‌లో మాదిరిగానే ప్రస్తుతం కూడా వాడపల్లి వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

- భక్తులతో కిటకిటలాడిన ఒంటిమిట్ట

సాక్షి ప్రతినిధి, కడప/ఒంటిమిట్ట: సాక్షి ప్రతినిధి, కడప/ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వైభవంగా జరుగుతున్న శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. పున్నమి వెన్నెల్లో జరిగిన ఈ కల్యాణాన్ని వేలాదిమంది భక్తులు కనులారా తిలకించి తరించారు. శ్రీసీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన వేలాదిమంది భక్తులకు శ్రీవారి సేవకులు ముత్యంతో కూడిన తలంబ్రాలను పంపిణీ చేశారు. అంతకుముందు శ్రీసీతారాముల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ శోభాయాత్రగా ఆలయం నుంచి కల్యాణవేదికకు తీసుకొచ్చారు. శ్రీకోదండరాముడి కల్యాణం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, కొట్టు సత్యనారాయణ దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.



మాంగల్యాన్ని చూపుతున్న వేదపండితులు

గురుకులంలో విద్యార్థిని ప్రసవం

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు



నారాయణఖేడ్: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని గురుకుల కళాశాల విద్యార్థిని (16) ఓ శిశువుకు జన్మనిచ్చింది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. గతనెల 24న సిర్గాపూర్ మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని ముళ్లపొదల్లో ఓ శిశువును గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ పసికందుకు ఆస్పత్రిలో చికిత్స చేయించి సంగారెడ్డిలోని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ముళ్ల పొదల్లో దొరికిన ఆ శిశువు గురుకుల కళాశాలలో విద్యార్థినికి జన్మించిన శిశువుగా ప్రాథమికంగా నిర్ధారణ అయినట్టు తెలుస్తోంది. కళాశాల ప్రిన్సిపాల్ డి.మంజుల బుధవారం మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. తమ కళాశాలలో వసతి పొందుతున్న ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని గర్భం దాల్చిందని, గత నెల 24న తెల్లవారు జామున 3.20 గంటలకు బాత్‌రూంలో ఆడ శిశువుకు జన్మనిచ్చిందని తెలిపారు. దీంతో ఆ శిశువుతో పాటు విద్యార్థినిని తల్లిదండ్రులకు అప్పగించినట్టు చెప్పారు.

ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు

ఈ ఘటనపై అంతర్గతంగా విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపాల్ మంజులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఔట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న డిప్యూటీ వార్డెన్ నజీమా బేగం, స్టాఫ్ నర్సు ఎం.సునీతలను విధుల్లోంచి తొలగించారు. రెండు రోజుల్లో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయని పోలీసువర్గాలు తెలిపాయి.

సిబ్బంది నిర్లక్ష్యం..?: గురుకులంలో వసతి పొందుతూ చదువుకుంటున్న విద్యార్థిని గర్భం దాల్చిన ఘటనలో గురుకుల కళాశాల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. ఆ విద్యార్థిని మానసికంగా, భౌతికంగా దృఢంగా ఉండటంతో ఎవరికీ అనుమానం రాలేదని ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. తర్వాత ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రసవం తర్వాత విద్యార్థినిని, శిశువును తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. తర్వాత వారు శిశువును పొదల్లో వదిలేసినట్టు బయట పడిందని మంజుల పేర్కొన్నారు.

కేటాయింపులకు మించి వాడకం

కుడి కాల్వకు నీటి నిలిపివేత

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జలాశయంలో కేటాయింపులకు మించి నీటి వాడకం జరిగింది. కృష్ణా నదీ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) సాగర్ కుడి, ఎడమ కాల్వలకు వానాకాలం, యాసంగి పంటలకు 132 టీఎంసీల చొప్పున నీటిని కేటాయించింది. అయితే కుడి కాల్వ కింద 198.8 టీఎంసీల నీటిని వాడుకోగా, ఎడమ క్వాల కింద ఇప్పటి వరకు 139 టీఎంసీల నీటి వినియోగం జరిగింది. కుడి కాల్వకు ఈ ఏడాది కేటాయించిన నీటికంటే ఎక్కువగా వినియోగిస్తున్న విషయంలో పలుమార్లు కృష్ణానది యాజమాన్య బోర్డు.. నీటిని నిలిపివేయాలని సంబంధిత అధికారులకు ఉత్తర్వులిచ్చినా పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. ఎట్టకేలకు ఈనెల 1వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు నీటిని నిలిపివేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయం కనీస నీటిమట్టానికి చేరువలో ఉంది. గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.50 టీఎంసీలు) కాగా.. ప్రస్తుత నీటిమట్టం 528.60 అడుగులు (165.4274టీఎంసీలు)గా ఉంది. కనీస నీటిమట్టం 510 అడుగులు (131.6690 టీఎంసీలు) కావడంతో.. డెడ్ స్టోరేజీకి పైన కేవలం 33.7584 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. ఎడమకాల్వ కింద అవసరాలకు మరో 15 రోజుల పాటు ఈ నీటినే విడుదల చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్‌తో పాటు గ్రామీణ ప్రాంతాలు, పలు పట్టణాలకు తాగునీటిని అందించాల్సి ఉంటుంది. జలాశయంలోకి కొత్తనీరు వచ్చే వరకు తాగునీటి అవసరాలకు ఈ నీరు సరిపోవడం అనుమానంగానే కనిపిస్తోందని ఇంజనీరింగ్ నిపుణులు అంటున్నారు.



‘మార్గదర్శి’ కేసులో ఏ-2 శైలజ విచారణ నేడు

▶ మొదటి పేజీ తరువాయి

రామోజీరావే నిధుల మళ్లింపు నిజమేనని దాదాపుగా అంగీకరించడంతో ఈ కేసులో సీఐడీ కీలక పురోగతి సాధించినట్లయింది. ఈ నేపథ్యంలోనే ఈ కేసులో ఏ-2గా ఉన్న చెరుకూరి శైలజ కిరణ్‌ను గురువారం విచారించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. శైలజను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలోనే విచారించనున్నారు. రామోజీరావు, శైలజ స్టేట్‌మెంట్లను విశ్లేషించిన అనంతరం ఈ కేసులో తదుపరి చర్యలకు ఉపక్రమించాలని సీఐడీ భావిస్తోంది. వారిద్దరినీ ఆంధ్రప్రదేశ్‌కు పిలిపించి మరీ విచారించేందుకు సీఐడీ సంసిద్ధమవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రాణం తీసిన యువకుడి వేధింపులు

జగిత్యాలలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం



ఆత్మహత్య చేసుకున్న ప్రియాంక

జగిత్యాలక్రైం: యువకుడి వేధింపులు ఓ యువతి ప్రాణాలు తీశాయి. పెళ్లి చేసుకోవాలని వెంటపడుతుండటంతో తట్టుకోలేక ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ వీధికి చెందిన మ్యాన రాజశేఖర్-జయశ్రీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ప్రియాంక (17) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వారి వీధికే చెందిన యువకుడు చేని సంపత్ ఉరఫ్ ఓంకార్... ప్రేమిస్తున్నానంటూ చాలాకాలంగా బాలిక వెంటపడుతున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని నిత్యం వేధిస్తున్నాడు. భరించలేక కుటుంబసభ్యులు గతేడాది డిసెంబర్ 19న పోలీసులను ఆశ్రయించారు. దీంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంపత్‌పై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపారు. తర్వాత బెయిల్‌పై విడుదలైన సంపత్ తన పద్ధతి మార్చుకోలేదు. తనను ప్రేమించాలంటూ నిత్యం ప్రియాంక వెంట పడుతూనే ఉన్నాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక.. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే ప్రియాంక మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

బాలికపై నలుగురు యువకుల లైంగికదాడి

- గర్భం దాల్చడంతో కప్పిపుచ్చే యత్నం
- నిందితులపై పోక్సో కేసు నమోదు

పెంబి: నిర్మల్ జిల్లా పెంబి మండలం పుల్గంపాండ్రి గ్రామానికి చెందిన బాలిక (17)పై నలుగురు యువకులు లైంగికదాడి చేశారు. బాలిక గర్భం దాల్చడంతో కప్పిపుచ్చే ప్రయత్నంలో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. పుల్గంపాండ్రి గ్రామానికి చెందిన బాలిక కుటుంబ సభ్యులు కొన్ని రోజులుగా జీవనోపాధి కోసం హరిచంద్‌తండా గ్రామానికి వెళ్లి కూలీ పని చేసుకుంటున్నారు. బాలిక మేకల కాపరిగా పనిచేస్తోంది. హరిచంద్‌తండా గ్రామ పంచాయతీ పరిధి తులసీపేట్‌కు చెందిన నలుగురు యువకులు ఆమెను బెదిరించి ఏడు నెలలుగా పలుమార్లు అత్యాచారం చేశారు. కాగా, బాలిక గర్భం దాల్చడాన్ని గమనించిన నలుగురు యువకుల్లో ఒకరు మంగళవారం సాయంత్రం గర్భస్రావానికి సంబంధించిన మాత్రలు ఇవ్వడంతో వేసుకుంది. కొన్ని గంటలకు నొప్పులు రావడంతో మృతశిశువుకు జన్మనిచ్చింది. బాలిక తల్లిదండ్రులు ఆరా తీయగా విషయం చెప్పింది. దీంతో బాలిక తండ్రి పెంబి పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. నిందితులు నలుగురిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు.

ఇసుక లారీలు వద్దన్నందుకు | మమ్మల్ని బహిష్కరించారు

- రామన్నపేట్ ముదిరాజ్‌ల ఆరోపణ
- జిల్లా మంత్రి ఆదుకోవాలని వేడుకోలు

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం రామన్న పేట్ గ్రామంలోని కుంట కింది సంఘం, గడ్డం సంఘం, బొమ్మ సంఘం, ఈర్ల ముదిరాజ్ సంఘాల సభ్యులు 300 మందిని గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ) సాంఘిక బహిష్కరణ చేయడం వివాదాస్పదంగా మారింది. బుధవారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో బాధిత సంఘాలకు చెందిన సభ్యులు లింబాద్రి, రుక్మిణి మాట్లాడుతూ.. ఇందుకు సంబంధించిన పూర్వాపరాలను వివరించారు. ‘‘రామన్నపేట గ్రామంలోని కప్పల వాగు నుంచి సంగేమ్ కిషన్ అనే వ్యక్తి ఇసుకను అక్రమంగా భారీ వాహనాలతో తరలిస్తున్నారు. మేము రాత్రిళ్ళు పంట పొలాలు, తోటల్లోని కరెంటు మోటార్ల దగ్గరికి వెళ్లి వస్తుండగా భారీ వాహనాలు పైకి వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముదిరాజ్‌లు నివసించే గల్లీలో నుంచి ఇసుకను తరలించవద్దని వీడీసీ సభ్యులకు విన్నవించాం. అంతే.. మా కులస్తులను గ్రామ బహిష్కరణ చేశారు..’’ అని చెప్పారు. గ్రామంలోని కిరాణా షాప్‌లలో నిత్యావసర వస్తువులు కొనుక్కోనివ్వడం లేదని, కిరాయి ఇళ్ల నుంచి ఒకటో తేదీ నాటికి ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులను స్కూల్‌కు పంపిస్తే అక్కడ ఇతర కులస్తుల విద్యార్థులతో మాట్లాడనివ్వడం లేదని, ఆడుకోనివ్వడం లేదన్నారు. ఎవరైనా మాతోమాట్లాడినా, బైకుల పైన వెళ్లినా రూ.లక్ష జరిమానా అంటూ భయపెడుతున్నారని తెలిపారు. కలెక్టర్, పోలీసులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రామన్న పేట్ ముదిరాజ్‌ల సంఘ సభ్యులు

మంత్రి పువ్వాడకు రాములోరి కల్యాణ తలంబ్రాలు



మంత్రికి తలంబ్రాలు అందజేస్తున్న ఈఓ

ఖమ్మంమయూరిసెంటర్: శ్రీరామనవమి పురస్కరించుకుని గత నెల 30వ తేదీన భద్రాచలంలో జరిగిన శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు అందజేశారు. భద్రాచలం ఆలయం ఈఓ రమాదేవి బుధవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ముత్యాల తలంబ్రాలను అందజేసి పలు అంశాలపై చర్చించారు.

జీ-20 సదస్సులో మహిళా ప్రాంగణం అధికారి విజేత



కేరళ మంత్రి నుంచి జ్ఞాపిక అందుకుంటున్న విజేత

ఖమ్మంఅర్బన్: కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో బుధ, గురువారాల్లో జరుగుతున్న అంతర్జాతీయ మహిళా సాధికారత జీ-20 సదస్సుకు ఖమ్మం మహిళా ప్రాంగణం అధికారి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి వేల్పుల విజేత ఎంపికయ్యారు. బుధవారం సదస్సుకు హాజరైన ఆమె మహిళా సాధికారితపై పలు సెమినార్లలో మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న సదస్సులో ఆమె పాల్గొనడంపై పలువురు అభినందించారు.

8న చెరుకు క్రషింగ్ ముగింపు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో ఉన్న మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్‌లో ఈ ఏడాది చెరుకు క్రషింగ్ 8వ తేదీన ముగించనున్నట్లు ఫ్యాక్టరీ సీజీఎం కోటయ్య తెలిపారు. 2022-23 సంవత్సరానికి గానుగ ఆడించడాన్ని 8వ తేదీన ముగించనున్న నేపథ్యాన రైతులు ఆలోపే ఫ్యాక్టరీకి చెరుకు తరలించాలని సూచించారు. ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు 4 లక్షల టన్నుల చెరుకు గానుగ ఆడించడానికి సహకరించిన రైతులు, కార్మికులు, ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా వార్తలు

‘తపాలా’ వడ్డీ పెరిగింది..

- పోస్టల్ పథకాలపై మిత్తి మరింత..
- సీనియర్ సిటిజన్లు, నెలవారీ ఆదాయ పొదుపు పరిమితి పెంపు
- ఈ పథకాల్లో నెలకోసారి వడ్డీ తీసుకునే అవకాశం
- మహిళలు, ఆడపిల్లలకు నూతనంగా పొదుపు పథకం



పథకాల వారీగా వడ్డీ రేట్ల వివరాలు (2023 ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు)

పొదుపు ఖాతా	వడ్డీ (శాతం)
సేవింగ్స్ అకౌంట్స్	4
రికరింగ్ డిపాజిట్	6.2
మంత్లీ ఇన్‌కం స్కీం	7.4
టైమ్ డిపాజిట్ (ఏడాదికి)	6.8
రెండేళ్లు	6.9
మూడేళ్లు	7
ఐదేళ్లు	7.5
సుకన్య సమృద్ధి యోజన	8
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్	7
సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్	8.2
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	7.7
కిసాన్ వికాస పత్రం	7.5

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ నిర్వహిస్తున్న పలు పథకాలపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లు పెంచింది. పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం కలిగేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్ నుంచి జూన్ వరకు)నకు వడ్డీ రేట్లు పెంచడమే కాక ఎంపిక చేసిన పొదుపు పథకాలకు పరిమితి కూడా పెంచారు. నూతన వడ్డీ రేట్లు, కొత్త పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోస్టల్ శాఖ ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి వర్గాలకు ఈ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఖమ్మం డివిజన్ తపాలా శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న తపాలా అధికారులు పలు ప్రాంతాల్లో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

పరిమితి పెంపు.. వడ్డీలో మార్పులు

సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీంలో అత్యధిక పొదుపును రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచారు. అంతేకాక ఈ పథకంలో మూడు నెలలకోమారు వడ్డీ తీసుకునే సౌకర్యం కూడా కల్పించారు. అలాగే, నెలవారీ ఆదాయ పథకం వ్యక్తిగత ఖాతాలో అత్యధిక పొదుపును రూ.4.5 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెంచారు. ఈ పథకంలోనూ నెల నెలా వడ్డీ పొందే అవకాశం ఉంది. ఇక మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ 2023 పేరుతో కొత్త పథకాన్ని అమలు చేస్తున్నారు. మహిళలు, ఆడపిల్లల కోసం వన్‌టైం స్మాల్ సేవింగ్ స్కీంగా దీనిని రూపొందించారు. ఈ పథకంలో 2025 వరకు చేరే అవకాశం కల్పించారు. ఈ పథకంలో రూ.2 లక్షల వరకు పొదుపు చేసుకునే అవకాశం ఉంది. రెండేళ్ల కాలపరిమితిలో పాక్షికంగా నగదు ఉపసంహరించుకునే వెసులుబాటు కూడా ఉంది.

బ్యాంకులతో పోలిస్తే అధిక వడ్డీ



పొదుపు పథకాలపై బ్యాంకులతో పోలిస్తే తపాలా శాఖ అధిక వడ్డీ చెల్లిస్తోంది. వివిధ వర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పొదుపు పరిమితి కూడా పెంచారు. తపాలా శాఖలో పొదుపు పథకాల్లో చేసిన మార్పులతో లబ్ధి జరగనున్నందున ప్రజలు వినియోగించుకోవాలి. ఆయా పథకాలతో ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తపాలా శాఖ ద్వారా కృషి చేస్తున్నాం.

– బి.రవికుమార్, తపాలా సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్

సత్తుపల్లి ట్రంక్‌కు నిధులు ఇవ్వండి

సీఎం కేసీఆర్‌ను కోరిన మాజీ మంత్రి తుమ్మల

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు సాగునీరు నీరందించే సీతారామ ప్రాజెక్టు 9, 10వ ప్యాకేజీల్లో భాగంగా పెండింగ్ పనులు, సత్తుపల్లి ట్రంక్ ద్వారా నీటి సరఫరా కోసం చేపట్టాల్సిన పనులకు నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. రెండు ప్యాకేజీల్లో 4.470 కిలోమీటర్ నుంచి 42.775 కిలోమీటర్ వరకు కొంత మెయిన్ కాల్వ, టన్నెల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని సీఎంకు వివరించానని తెలిపారు. భూసేకరణతో పాటు కాల్వ పనుల పూర్తికి అవసరమైన రూ.52,34,75,998లను త్వరగా విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు. కాల్వ ఎగువ భాగంలో మూడు పంపు హౌస్‌లు పూర్తయ్యాయని, టన్నెల్ కూడా పూర్తయితే ఈ సంవత్సరం బేతుపల్లికి నీళ్లు అందుతాయని చెప్పగా, స్పందించిన సీఎం త్వరలోనే మంత్రి హరీశ్‌రావు ఆయా పనులపై సమీక్షిస్తారని చెప్పారని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి పతనం తప్పదు

భద్రాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ కనకయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కోరం కనకయ్య

గార్ల: రాష్ట్రంలో ప్రజావ్యతిరేకత పాలన కొనసాగిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి రానున్న రోజుల్లో పతనం తప్పదని.. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా గార్లలోని వర్తక సంఘం భవనంలో బుధవారం జరిగిన పొంగులేటి, కోరం కనకయ్య వర్గీయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో 1,200మంది ఆత్మబలిదానాలు చేసుకోగా.. వారి త్యాగాలతో గద్దెనెక్కిన కేసీఆర్ నాటి నుంచి నేటి వరకు అక్రమ ఆస్తులు కూడబెట్టారని విమర్శించారు. అందుకే రాబోయే ఎన్నికల్లో దేశంలోని మిత్రపక్షాలకు ఖర్చు చేస్తానని ప్రకటించారని అన్నారు. స్కాంలు, పేపర్ లీకేజీలతో సీఎం బిజీగా ఉంటూ బంగారు తెలంగాణ నిర్మాణాన్ని గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. త్వరలోనే మెజార్టీ ప్రజల ఆమోదం మేరకు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏ పార్టీలో చేరాలనేది నిర్ణయిస్తారని కనకయ్య పేర్కొన్నారు. ఈసమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, నాయకులు గుండా వెంకట్ రెడ్డి, మీరాపతాన్, బాదావత్ రవి, యాకూబ్‌పాషా, వెంకటేశ్వర్లు, అశోక్, బాలూనాయక్, తాళ్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రెండు రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలు

తల్లాడ: ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కుర్నవల్లిలోని వేంకటాచలపతి దేవాలయంలో జరిగే తిరుకల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలు బుధవారం రెండోరోజుకు చేరాయి. రెండోరోజు ఆర్ఆర్సీ సికింద్రాబాద్-కర్నూలు జట్లు తలపడగా కర్నూలు, విశాఖపట్నం-గుబ్బగుర్తి (ఖమ్మం) జట్ల నడుమ పోటీలో విశాఖపట్నం, భద్రాద్రి కొత్తగూడెం-బాపట్ల జట్ల నడుమ పోటీలో భద్రాద్రి కొత్తగూడెం జట్టు గెలుపొందాయి. ఈ పోటీలకు రిఫరీలుగా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి క్రిస్టోఫర్‌తో పాటు వీరరాఘవయ్య, సత్యనారాయణ, నాగప్రసాద్ వ్యవహరించారు. తొలుత క్రీడాకారులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ పరిచయం చేసుకోగా, పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల నుంచి పెద్దసంఖ్యలో యువత తరలివచ్చింది.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

సత్తుపల్లి మార్కెట్‌కు రూ.2.65 కోట్ల ఆదాయం



సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

సత్తుపల్లి: సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్‌కు తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో గణనీయమైన ఆదాయం లభించింది. ఈ ఆర్థిక సంవత్సరం రూ.1.80 కోట్ల లక్ష్యం విధించగా, రూ.2.65 కోట్ల ఆదాయం నమోదైందని మార్కెట్ కార్యదర్శి జి.సత్యనారాయణ వెల్లడించారు. మార్కెట్ పరిధిలోని సత్తుపల్లి చెక్‌పోస్టు ద్వారా రూ.1.01 కోట్లు, గంగారం చెక్‌పోస్టు ద్వారా రూ.1.03 కోట్లతో పాటు వెంకటాపురం చెక్‌పోస్టు ద్వారా రూ.60.05 లక్షల ఆదాయం లభించింది. వెంకటాపురం చెక్‌పోస్టుకు రూ.15 లక్షల లక్ష్యం విధించగా రూ.60.05 లక్షల ఆదాయం రావడంతోనే రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. కాగా, 2021-22 ఆర్థిక సంవత్సరంలోనూ రూ.1.47 కోట్ల లక్ష్యానికి రూ.1.67 కోట్ల ఆదాయం వచ్చిందని కార్యదర్శి పేర్కొన్నారు.

పోరాటాల ద్వారానే పార్టీ విస్తరణ

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంత రావు



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా పోరాటాల ద్వారానే పార్టీ విస్తరణ సాధ్యమవుతుందని.. ఈ విషయాన్ని గుర్తెరిగి ప్రజా పోరాటాలకు కమ్యూనిస్టు శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు సూచించారు. స్థానికంగా ప్రజాసమస్యలను గుర్తిస్తూ వాటి పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో సిద్ధినేని కర్ణకుమార్ అధ్యక్షతన బుధవారం జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలను వదిలేసిన పాలకులు.. ఓటు బ్యాంకు రాజకీయాలకు అలవాటు పడి సంపన్న వర్గాలకు కొమ్ము కాస్తున్నారని తెలిపారు. ప్రధాని మోడీ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. రోడ్లు, విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, నౌకాశ్రయాలు, విలువైన భూములు, ఖనిజ సంపద, కర్మాగారాలే కాక జాతిరత్నాలుగా చెప్పుకునే అనేక సంస్థలను మోడీ కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని తెలిపారు. ఇదిలాగే కొనసాగితే ప్రజాస్వామ్య మనుగడ, లౌకిక వాదానికి ప్రమాద ఘంటికలు మోగడం ఖాయమని హేమంతరావు చెప్పారు. కాగా, ప్రజలను చైతన్యపరిచి మతోన్మాద రాజకీయ శక్తులను నిలువరించేందుకు ఈనెల 14 నుండి జన చైతన్య యాత్ర చేపడుతున్నామని, ఈ యాత్ర సత్తుపల్లిలో మొదలై జిల్లావ్యాప్తంగా సాగుతుందని తెలిపారు. ఇక ఈనెల 9న హైదరాబాద్‌లో జరిగే వామపక్షాల బహిరంగ సభకు జిల్లా నుంచి కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.